# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

అనునిత్యం ప్రజల పక్షం

TELTEL12273

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న

తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన యువతి యువకులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209



వరంగల్ సంపుటి : 2 సంచిక : 163 మంగళవారం 16 - 07 - 2024 పేజిలు : 08 వెల : 5


## మాదాద్రిలో గరి ప్రదక్షిణం

### భారీగా హాజరైన భక్తులు

యాదగరిగుట్ట, **తెలంగాణ ముచ్చట్లు** జూలై15 : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత వైకుంఠ ద్వారం వద్ద స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూజలు చేసి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ ఈవో భాస్కరరావు, ధర్మకర్త నరసింహమూర్తి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు పాల్గొన్నాయి. మరోవైపు యాదాద్రి క్షేత్రం గర్భాలయంలోని మూలవరులకు సోమవారం ఉదయం అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. ఈ విశేష క్రతువును వేదమంత్రోచ్ఛరణల మధ్య చేపట్టారు.

### స్థానిక ఎన్నికలపై

# సీఎం రేవంత్ దృష్టి

**- బిసి రిజర్వేషన్ల పెంపునకు కార్యాచరణ**

**- సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష**




హైదరాబాద్, **తెలంగాణ ముచ్చట్లు** : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు సీఎం రేవంత్‌కు వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బిహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా

2 లో

### సచివాలయ ముట్టడికి యత్నించిన

# బిసి జనసభ

- సచివాలయంలోకి చొచ్చుకుని పోయే యత్నం
- రాజారాం యాదవ్ తదితరుల అరెస్ట్
- అరెస్టులను ఖండించిన కెటిఆర్

హైదరాబాద్, **తెలంగాణ ముచ్చట్లు** : తెలంగాణ సెక్రటేరియట్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయడం సహా, బీసీ కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో బీసీ జనసభ నాయకులు, నిరుద్యోగులు సచివాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సచివాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా ఆందోళన కారులను అరెస్ట్ చేసి డీసీఎం వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగుల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా బీసీ జనసభ కార్యకర్తలు సచివాలయంలోకి చొచ్చుకెల్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో




నిరుద్యోగలు, జనసభ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు

2 లో

### డ్రగ్స్ విక్రయ

## ముఠా అరెస్ట్

### ఐదుగిరి అరెస్ట్..మరో ఇద్దరు పరారీ

హైదరాబాద్,జూలై15 **తెలంగాణ ముచ్చట్లు** : డ్రగ్స్ విక్రయ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు డీసీపీ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు నైజీరియన్లు కూడా ఉన్నట్లు తెలిపారు. రూ.35 లక్షల విలువైన 199 గ్రాముల కొకైన్‌తోపాటు, రెండు పాస్‌పోర్టులు, 10 ఫోన్లు, 2 బైకులను సీజ్ చేశామన్నారు. నిందితులను ఒనౌహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీం, వెంక గౌతమ్, వరుణ్ కుమార్, మహ్మద్ షరీఫ్‌లుగా గుర్తించారు. పరారీలో ఉన్న ఇద్దరి గురించి సమాచారం ఇస్తే రూ.2 లక్షల రివార్డు ఇస్తామని డీసీపీ ప్రకటించారు. ‘అనౌహాలబెస్సింగ్ ఇక్కడికి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తుంది. ఇప్పటి వరకు ఆమె 20సార్లు నైజీరియా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చినట్లు గుర్తించాం. ఆమె దగ్గర 13 మంది డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు గుర్తించాం. వారిలో

2 లో

### రసాభాసగా

# చెక్కుల పంపిణీ కార్యక్రమం

**ప్రొటోకాల్ పాటించలేందటూ ఎమ్మెల్యే సబిత నిరసన**



హైదరాబాద్,జూలై15**తెలంగాణ ముచ్చట్లు** : మహేశ్వరం నియోజకవర్గం, ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ప్రొటోకాల్ ఉల్లంఘించి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకునితో చెక్కులు పంపిణీ చేయించడంపై మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేదిక కింద కూర్చొని సబితా ఇంద్రారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుండి చేపట్టే ఏ

2 లో

# మొక్కలను నాటి..పచ్చదనం పెంచాలి

**ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి**





కామారెడ్డి,జూలై 15**తెలంగాణ ముచ్చట్లు** : వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వన సంరక్షణలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులు తప్పకుండా మొక్కలు పెంచాలన్నారు. ఇలా అయినా కొంత పచ్చదనం దోహదపడగలదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని

2 లో

# రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ

**రైతుభరోసా అభిప్రాయ సేకరణలో భట్టి**




వరంగల్,జూలై15**తెలంగాణ ముచ్చట్లు** :రైతు భరోసాపై అసెంబ్లీలో చర్చ పెడుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆగస్టు నాటికి రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు బీమా సౌకర్యం కల్పించేందుకు

3 లో

# రుణమాఫీపై మభ్యపెట్టే ప్రయత్నాలు

**- పిఎం కిసాన్ డేటాకు ఏడు నెలలెందుకు**

**- కాలయాపన చేయడంలో రైతులను మోసం చేసే కుట్ర**

**- రుణమాఫీ మార్గదర్శకాలపై మండిపడ్డ నిరంజన్ రెడ్డి**



హైదరాబాద్, జూలై15**తెలంగాణ ముచ్చట్లు** : రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమేనని మాజీ వ్యవసాయశ్రాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లని అన్నారు. పంటల రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. అవి మార్గదర్శకాలు కావు.. మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది అని

2 లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

మంగళవారం 16 -07- 2024

వరంగల్



# సంపాదకీయం

## అంబానీ బ్రదర్స్ నివాసాల విలువ 2000 కోట్లు

అంబానీ కుటుంబానికి చెందిన అత్యంత విలాసవంతమైన గృహాలు అన్ని వేళలా ప్రజల్లో చర్చనీయాంశం. ముఖేష్ అంబానీ రూ. 15,000 కోట్ల యాంటిలియా ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన గృహాల్లో ఒకటి... అనిల్ అంబానీ రూ. 5000 కోట్ల ఆంటిలియా టవర్.. ఇషా అంబానీ %-%గులిటా%-% భవంతి... వీటన్నిటి విలువ అక్షరాలా 2500 కోట్లు. అంబానీ కుటుంబ ఆస్తులు వారి అపారమైన సంపద, సంపన్న జీవనశైలికి ప్రత్యక్ష నిదర్శనంగా ఈ మూడు ఇల్లు నిలుస్తాయి. ప్రతి ఆస్తి విలాసవంతమైన సకల సౌకర్యాలతో తులతూగే భారీ భవంతులు. విలాసాలపై వారి అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. కేవలం అంబానీ బ్రదర్స్ కి చెందిన రెండు ఇండ్ల విలువ సుమారు 2000 కోట్లు. భారతీయ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ సుమారు 121 బిలియన్ డాలర్ల(10 లక్షల కోట్లు) నికర ఆస్తి విలువతో ప్రపంచంలోని అత్యంత సంపన్న వ్యాపారుల్లో ఒకరిగా నిలిచారు. ఆసియాలో నంబర్ 1 ధనికుడిగా రికార్డులకెక్కారు. అతడి విస్తృతమైన వ్యాపార సామ్రాజ్యంతో పాటు, అంబానీ అతడి కుటుంబం భారతదేశంలోని అత్యంత విలాసవంతమైన స్థిరాస్తులను కలిగి ఉన్నారు. ఐకానిక్ యాంటిలియా నుండి సెన్సిటివ్ %-%గులిటా భవంతి%-% వరకు.. అంబానీ కుటుంబం రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియో వారి అపారమైన సంపదల్ని సంపన్న జీవనశైలిని ప్రతిబింబిస్తుంది. అంబానీ కుటుంబానికి చెందిన అతి విలాసవంతమైన ఇళ్ల గురించి తెలుసుకోవాలనుకుంటే.. ఆశ్చర్యం గొలిపే నిజాలు ఎన్నో ఉన్నాయి. ముఖేష్ అంబానీ రూ. 15,000 కోట్ల యాంటిలియాలో నివశిస్తుండగా.. అనిల్ అంబానీ రూ. 5000 కోట్ల ఆంటీలియాలో నివశిస్తున్నారు. యాంటిలియా: ఎ మార్వెల్ ఆఫ్ మోడర్న్ ఆర్కిటెక్చర్ ముఖేష్ అంబానీ – నీతా అంబానీ దక్షిణ ముంబైలోని 27–అంతస్తుల టవర్ అయిన యాంటిలియాలో నివసిస్తున్నారు. దీని విలువ సుమారు రూ. 15,000 కోట్లు (2 బిలియన్ డాలర్లు). అమెరికన్ ఆర్కిటెక్చరల్ సంస్థ పెర్కిన్స్ %డ% విల్ దీనిని రూపొందించింది. అత్యంత అధునాతన సాంకేతికతతో ఆస్ట్రేలియా లైటన్ హోల్డింగ్స్ నిర్మించింది. యాంటిలియా బకింగ్‌హామ్ ప్యాలెస్ తర్వాత ప్రపంచంలోనే రెండవ అత్యంత ఖరీదైన ఇల్లు. యాంటిలియాలో తొమ్మిది హై–స్పీడ్ ఎలివేటర్లు, మూడు హెలిప్యాడ్‌లు, హెల్త్ సెంటర్, బాల్‌రూమ్, మినీ థియేటర్, యోగా స్టూడియో, స్నో రూమ్, బాబిలోన్–ప్రేరేపిత హాంగింగ్ గార్డెన్‌లు సహా సకల సౌకర్యాలు ఉన్నాయి. ఈ విలాసవంతమైన నివాసం అంబానీ కుటుంబం లగ్జరస్ జీవనశైలికి చిహ్నంగా నిలుస్తుంది. యాంటిలియాకు వెళ్లడానికి ముందు, అంబానీ కుటుంబం కోలాబాలోని 14–అంతస్తుల టవర్ అయిన సీ విండ్‌లో నివసించింది. ఈ ఆస్తిలో ముఖేష్ అంబానీ, అతడి తల్లి కోకిలాబెన్ అంబానీ, అతడి సోదరుడు అనిల్ అంబానీ .. వారి కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబ సభ్యుడు భవనంలోని పలు అంతస్తుల్లో నివసించారు. 2024లో అంబానీ సోదరీమణులు, నీనా కొఠారి , దీప్తి సల్గావ్కర్, వారి తల్లి కోకిలాబెన్ అంబానీ 90వ పుట్టినరోజు సందర్భంగా సీ విండ్‌లో గొప్ప వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులందరూ హాజరయ్యారు. వారు ఈ సందర్భంగా పింక్ కలర్ దుస్తులను ధరించారు. ముఖేష్ అంబానీ తన కూతురు ఇషా అంబానీకి బహుమతిగా ఇచ్చిన ఇంటి ఖరీదు వందల కోట్లలో ఉంది. అంబానీ కుటుంబం మూలాలు గుజరాత్‌లోని జునాగఢ్‌లోని చోర్వాడ్ అనే గ్రామంలో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ జన్మస్థలమైన ఈ తీరప్రాంత గ్రామంలో వారికి పూర్వీకుల ఆస్తి ఉంది. ఈ ఆస్తి 1.2 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చుట్టూ పచ్చదనం నిండి ఉంది. ధీరూభాయ్ అంబానీ మెమోరియల్ హౌస్: గతంలో మంగరోల్వాలనో డెలో అని పిలుచుకున్న ఆస్తిని రీమోడలింగ్ చేసారు. ధీరూభాయ్ అంబానీ మెమోరియల్ హౌస్ అని పేరు కూడా మార్చారు. ఇది ధీరూభాయ్ అంబానీ ఫౌండేషన్ నిర్వహణలోని ప్రైవేట్ ప్రాంతంగా, అలాగే పబ్లిక్ విభాగంగా విభజితమైంది. 2011లో గుజరాత్‌లో జరిగిన వేడుకలకు అంబానీ కుటుంబం హాజరై ఈ స్మారక ఇంటిని లాంచ్ చేసింది. అనిల్ అంబానీ విలాసవంతమైన ఇల్లు: అనిల్ అంబానీ, ముఖేష్ అంబానీ తమ్ముడు అన్న సంగతి అందరికీ తెలుసు. ముంబై బాంద్రాలోని 17–అంతస్తుల టవర్ అబోడ్– ఆంటీలియాలో అతడు తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఈ విలాసవంతమైన ఆస్తి 16,000 చదరపు అడుగుల విస్తీర్ణం, 70 మీటర్ల పొడవు ఉంటుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. అబోడ్ విలువ దాదాపు రూ. 5,000 కోట్లు, ఇది భారతదేశంలోని అత్యంత ఖరీదైన గృహాలలో ఒకటిగా నిలిచింది. అబాడ్‌లో అనిల్ అంబానీ .. అతడి భార్య టీనా అంబానీ విలాసవంతమైన జీవనశైలిని ప్రతిబింబిస్తూ వ్యాయామశాల, హెలిప్యాడ్, స్విమ్మింగ్ పూల్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఇషా అంబానీ సువిశాల భవనం: ఇషా అంబానీ .. ముఖేష్ అంబానీ ఏకైక గారాల కుమార్తె. 12 డిసెంబర్ 2018న ఆనంద్ పిరమల్ ను ఇషా పెళ్లాడారు. ఆనంద్ పిరమల్ తల్లిదండ్రులు స్వాతి – అజయ్ పిరమల్‌లు గులిటా అనే సీఫేసింగ్ భవనాన్ని బహుమతిగా ఇచ్చారు. ముంబైలోని వర్లీలో ఉన్న ఈ భవనాన్ని లండన్‌కు చెందిన ఆర్కిటెక్చరల్ సంస్థ ఎకర్లీక్స్ కల్లాఘన్ రూపొందించారు. గులిటా 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీని విలువ 450 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఐదు అంతస్తుల డైమండ్ షేప్ భవనంలో పెద్ద పచ్చిక స్థలం, భూగర్భ పార్కింగ్, ఆలయం, స్విమ్మింగ్ పూల్ సహా అనేక ఇతర విలాసవంతమైన సౌకర్యాలు ఉన్నాయి.

# భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాల్సిందే

## బండి సంజయ్, కెటిఆర్ ల తీరుపై మండిపడ్డ పొన్నం

కరీంనగర్,జూలై15: భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లో 43 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ అలవాటు అందరి జీవితంలో భాగం కావాలని కోరారు..ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేస్తోంది. ఎన్ని చేసినా ప్రజల సహకారం కావాలి. కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఉండాలంటే అందరూ దీనిపై దృష్టి సారించాలి. ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలి. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల కార్యక్రమంగా, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. భాజపా ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోవాలా? డిసెంబర్ 3 వరకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే ఆలోచనే లేదు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటుంటే.. నిలబెట్టడానికి వారు వస్తున్నారు. మేం ధర్మం తప్పలేదు.. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు. కులగణనపై మరో రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం‘ అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బండి సంజయ్, కేటీఆర్ తీరు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందన్నారు.కండువా కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది.

## రుణమాఫీపై మభ్యపెట్టే ప్రయత్నాలు

నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం కోసం వ్యవసాయ సుస్థిరత కోసం కేసీఆర్ 2 విడుతల రుణమాఫీ పక్రియకు శ్రీకారం చుట్టారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. మొదటి విడుతలో 35.31 లక్షల మంది రైతులకు రూ. 16,144.10 కోట్లు రుణమాఫీ చేశారు. రెండో విడుతలో 22 లక్షల 98 వేల 39 రైతులకు రూ. 13,000.51 కోట్లు రుణమాఫీ చేశారు. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే ఇలా ఎన్నికలు అయిపోగానే అలా డిసెంబరు 9న రుణమాఫీ చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఉన్న 69 లక్షలపై చిలుకు ఉన్న తెలంగాణ రైతాంగంలో ఆశలు రేపింది. అందరి రుణాలను మాఫీ చేస్తామని ఆ రోజు బహిరంగంగా చెప్పారు. ఈ రోజు కొందరికే పరిమితం చేసేందుకు మార్గదర్శకాలు తీసుకువచ్చారు. ఈ రోజుల్లో 5 ఎకరాల వ్యవసాయదారుడు, రూ. 30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడు. రేషన్ కార్డు, పీఎం డాటా వంటి తోకా తొండాలు పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేస్తున్నారు. రుణమాఫీ చేశాం అన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు తప్ప .. రైతాంగం బాగుండాలి .. వ్యవసాయం బాగుండాలి అన్న సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో రూ.2 లక్షల రుణం పొందిన రైతులు ఎంత మంది ఉన్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. పీఎం కిసాన్ డాటాను మార్గదర్శకంగా తీసుకుంటాం అని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదు. అసలు దానికి సంబంధించిన షరతులే లోపభూయిష్టం అయినవి. రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమే .. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకు..? మరి ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లు ? నాడు పరుగెత్తి రుణాలు తీసుకోండి వెంటనే రుణమాఫీ చేస్తాం అని రైతులను పరుగులు పెట్టించి నేడు చావు కబురు చల్లగా చెబుతున్నారు. తెల్లరేషన్ కార్డు ప్రామాణికం కాదని సీఎం రేవంత్ ఇటీవలే ప్రకటించాడు.. సరిగ్గా నాలుగు రోజులు తిరగక ముందే నాలుక మడతేశాడు అని నిరంజన్ రెడ్డి కోపోద్రిక్తులయ్యారు.

## రసాభాసగా చెక్కుల పంపిణీ కార్యక్రమం

కార్యక్రమమైనా పార్టీ పరంగా చేస్తాం.. ఓడిపోయిన వ్యక్తుల చేతనే కార్యక్రమాలను నిర్వహిస్తామని ఒక చట్టం తీసుకొస్తే తమకేమీ ఇబ్బంది లేదని తెలిపారు. గెలిచిన వ్యక్తులు అంటే గౌరవం లేకుండా రాజకీయ ఏజెండాగానే పాలన నడిపిస్తున్నారని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రంలో అత్యాచారాలు, దోపిడీలు చేస్తుంటే ఈ ప్రభుత్వం కళ్లు మూసుకొని పాలన కొనసాగిస్తుందని ఆమె విమర్శించారు. నిరుద్యోగులంతా రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనపడటం లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులను గౌరవించే సంస్కృతిని ఈ ప్రభుత్వం మర్చిపోతుందని, స్పీకర్ ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సచివాలయ ముట్టడికి యత్నించిన బిసి జనసభ

ప్రయత్నించిన బీసీ జనసభ కార్యకర్తలను పోలీసులు పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తింది. జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా కార్యకర్తలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో డీఎస్సీని వాయిదా వేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదావేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్–1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రెటేరియట్ పోలీసుల వలయంలోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో సచివాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుపకంచెలు, వాటర్ క్యానన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సచివాలయ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. ఇదిలావుంటే నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గ పూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వారి సమస్యలను సానుకూల థృక్పథంతో నెరవేర్చాల్సింది పోయి నిర్భంధం పెడతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల కోసం సెక్రటేరియేట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాం యాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటాన్ని కేటీఆర్ ఖండించారు. రాజారాం యాదవ్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావటం, శాంతియుతంగా ఆందోళన చేయటం కూడా ఈ ప్రజాపాలన నిషేధమా అని కేటీఆర్ ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం అణిచివేత ధోరణిని సాగిస్తుందని ఇది ఎంత మాత్రం మంచిది కాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాం యాదవ్ సహా మిగతా విద్యార్థి

నాయకులందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని ఇప్పుడు పట్టించుకోవటం మానేసిందని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకుంటే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గద్దెనెక్కారో ఇప్పుడు వాళ్లే ఈ ప్రభుత్వం పతనానికి కారణమవుతారన్నారు. నిరుద్యోగ డిమాండ్లను పరిశీలించకుండా ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి అవలంభిస్తే తప్పకుండా బీఆర్ఎస్ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికలపై సిఎం రేవంత్ దృష్టి

ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్ట్

ఆరుగురికి కొకైన్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. వీరిపైనా కేసులు నమోదు చేశాం. పాజిటివ్‌గా తేలిన వారిలో అమన్ ప్రీత్‌సింగ్, అంకిత్, ప్రసాద్, నిఖిల్ తదితరులు ఉన్నారు ‘ అని డీసీపీ వివరించారు.

## మొక్కలను నాటి..పచ్చదనం పెంచాలి

దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు. ఇకపోతే ప్రతీ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అన్నారు.ప్రతీ గ్రామంలో ఈజీఎస్ అధికారులతో నర్సరీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో స్థలాలను ఎంపిక చేస్తున్నా మన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, వన సంరక్షకుల ఆధ్వర్యంలో మొక్కలను పెంచుతామన్నారు. ముందుగానే ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ 20 మొక్కలు నాటాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తోంది. పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చూస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యాక్రమంలో పాల్గొంటే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక










# సర్వజ్ఞలో ఉత్సాహంగా మాక్ పోలింగ్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : స్థానిక వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ స్కూల్లో శనివారం పోలింగ్ ఉత్సాహంగా జరిగింది. పాఠశాల విద్యార్థి నాయకుడు, ఉప నాయకుడు, తరగతి విద్యార్థి నాయకులను ఎన్నుకోడానికి సర్వజ్ఞ స్కూల్ యాజమాన్యం ఈ పోలింగ్ నిర్వహించారు. తొలుత ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్లను జారీ చేయడం, నామినేషన్లు వేయడం గుర్తులు కేటాయించడం, ప్రచారం చేయడం ఓట్లు వేయడం, ఓట్ల లెక్కింపు, గెలుపొందిన వారు విజయోత్సవం చేయడం వరుసగా ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకున్నది. అనంతరం పాఠశాల డైరెక్టర్లు ఆర్.వి నాగేంద్ర కుమార్, ఆర్.వి నీలిమ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడానికి ఈ మాక్ పోలింగ్ ను నిర్వహించడం జరిగిందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రానీయం

**- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**- నగరంలో కేంద్రీయ విద్యాలయం, అంబేద్కర్ కళాశాల, గిరిజన హాస్టల్ తనిఖీ**

**- సమస్యలు పరిష్కరిస్తామని హామీ**







ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ బిడ్డలు ఉన్నత స్థితికి చేరుకోవాలని.. చదివిస్తుంటారని అలాంటి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఖమ్మంలోని కేంద్రీయ విద్యాలయం, ఎన్ఎస్పీ నగర్లోని అంబేద్కర్ కళాశాల, గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి విద్యార్థులతో ఆత్మీయంగా పలకరించారు. కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అక్కడి ప్రాంగణంలో మొక్క నాటారు. బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి సమావేశమై పలు అంశాలు చర్చించారు. నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు అని.. బోధనలో రాజీ పడకుండా తీర్చిదిద్దాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. ఇబ్బంది రానీయకుండా.. పరిష్కరిస్తామని అభయమిచ్చారు. చక్కగా చదువుకోవాలని.. రేపటి ఉద్యోగులుగా నిలవాలని ఆకాంక్షించారు. నీటి, భవన సదుపాయ లోటుపాట్లు లేకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో..: కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగెందర్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు కొప్పుల చంద్రశేఖర రావు, కూర్మా రావు, తిప్పి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏనుగు మహేష్, కాకి శ్రీను, నగేష్, ఆయా సంస్థల బోధనా, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్,జూలై15 : గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విద్యార్థులకు సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల కలిగే నష్టాలపై మామూనూర్ పోలీసుల అధ్వర్యంలో బొల్లికుంటలో గల వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అథిదిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్నారు. ఈ ప్రమాదం బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాల సేవించడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలి పోతుందని హెచ్చరించారు.

# రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ

సీఎం యత్నిస్తున్నారని తెలిపారు. హనుమకొండ జిల్లాలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క, కొండా సురేఖ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రైతు భరోసాపై రైతులందరి అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. వరంగల్ నుంచే రాహుల్ గాంధీ రైతు భరోసా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతీ హామీని నెరవేరుస్తున్నామని చెప్పారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. రైతు భరోసాపై ప్రతి ఒక్కరి సూచనలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఇచ్చిన హామీలపై మాట తప్పబోమన్నారు. నిరుద్యోగులను కొందరు కావాలనే రెచ్చగొడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం రైతులన్ని నిండా ముంచిందననారు. గత ప్రభుత్వం నాలుగు గోడల మధ్యే నిర్ణయాలు తీసుకుందన్నారు. నిరుద్యోగుల పేరుతో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అర్హులకే రైతు రైతు భరోసా పథకం వర్తిస్తుందన్నారు. తమ ప్రభుత్వం ఓపెన్ మైండ్ గా ఉంటుందని.. గత ప్రభుత్వం అనర్హులకు రైతు బంధు ఇచ్చిందననారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఇకపోతే ప్రజల నుండి పన్నుల రూపంలో వచ్చే ప్రతీ పైసా ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు పెడతామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా పథకం అవగాహన సదస్సుకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక మైన హామీలను నెరవేర్చిందన్నారు. మాది ప్రజా ప్రభుత్వం కాబట్టి.. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రజల నుండి పన్నుల రూపంలో వచ్చే ప్రతీ పైసా ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు పెడతామన్నారు. అడ్డగోలుగా వాటిని దుర్వినియోగం చేయమని తెలిపారు. రైతు భరోసా సదస్సుకు మంత్రులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ.. 12 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఎంపీ రైతు సంఘ నాయకులు హాజరయ్యారు. రైతు భరోసా విధివిధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను సేకరించారు. రైతుబంధులో తప్పులు జరిగాయని మంత్రి సీతక్క అన్నారు. నిజానికి వ్యవసాయం చేసిన రైతులకు కాకుండా పట్టాలు ఉన్న వారికి మాత్రమే రైతు బందు గతంలో ఇచ్చారన్నారు. పట్ట బందు గానే మారిందన్నారు. 40 ఏళ్ల క్రితం భూములు అమ్ముకొని పేరు మారకపోవడంతో సాగు చేసే రైతులకు పెట్టుబడి రాలేదన్నారు. ఈ లాంటి సదస్సులో గతంలో జరిగిన లోపాలను సరిచేసి నిజమైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సదస్సు మంచి వచ్చే సూచనతో రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మరోవైపు మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రైతు బంధు పథకం లో భూ స్వాముల లకు కాకుండా నిజమైన రైతులకు ఇవ్వాలని తెలిపారు. గత ప్రభుత్వం హయం లో భూ స్వాముల కు లక్షల రూపాయలు పొందారన్నారు. నిజమైన రైతులకు ఆడాల్సిన పెట్టుబడి సహాయం ఆడలేదన్నారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం లో రైతులకు సబ్సిడీలు అందాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగిందన్నారు. పశువులకు కూడా ఇన్స్యూరెన్స్ చేయించాలన్నారు. పశువులు చనిపోతే రైతులకు నష్టం జరుగుతోందని తెలిపారు.



# ఎంఈఓ కొమురయ్య బదిలీ

**- ఉపాధ్యాయుల అందరూ ఆత్మీయ వీడ్కోలు పలికారు**

స్టేషన్ ఘనపూర్ :తెలంగాణ ముచ్చట్లు : జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రము లోని మీదికొండ ప్రాథమిక పాఠశాలలో బదిలీ పై వేరే పాఠశాలకు వెళ్లిన ప్రకాష్, ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఈరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కు బదిలీ అనే అంశం సర్వ సాధారణం అని,అందులో మన విద్యాశాఖ లో ఈ బదిలీలు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నూతనోత్తేజంగా ఉండలని అన్నారు. ఎందుకంటే ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకు బదిలీ పై వెళ్ళినపుడు నూతన విద్యార్థిని విద్యార్థులతో పరిచయాలు ఏర్పడి వారి అభివృద్ధికి దోహద పడుతుందని అన్నారు, అనంతరం ప్రకాష్ ప్రవీణ్ కుమార్ సార్ ను పూల మాలలతో,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు హూన్య నాయక్, ఉపాద్యాయులు వెంకటయ్య,లక్ష్మ రెడ్డి,రాజు, ఉషా రాణి, అంగన్ వాడి టీచర్ మంగమ్మ,రాధిక, ఎం ఆర్ సి సిబ్బంది గిరి, రమేష్, వెంకటేశ్వర్లు, లవన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జంగాను కలిసిన దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



తెలంగాణ ముచ్చట్లు దేవరుప్పుల: దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు,దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆద్వర్యంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మాజీ జనగామ డిసిసి అధ్యక్షుడు జంగా రాఘవ రెడ్డిని సోమవారం హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిరాజుల కిష్టయ్య,కారుపోతుల యాకస్వామి, రెడ్డిరాజుల ఎల్లప్ప,రెగటి సోమన్న,ఆకుల సంతోష్,తోటకూరి మహేష్,కారుపోతుల సురేష్,చిలుకూరి ఉమేష్,చింత శ్రీకాంత్,ఉప్పుల బాబు,తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట-అంగన్వాడీ బాట అవగాహన సదస్సు




తెలంగాణ ముచ్చట్లు దేవరుప్పుల: దేవరుప్పుల మండలంలోని ధర్మాపురం సింగరాజుపల్లి దేవరుప్పుల గ్రామాల్లో సోమవారం అమ్మ మాట-అంగన్వాడీ బాట అవగాహన కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ 2 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని,అంగన్వాడీ కేంద్రంలో నర్సరీ తరగతులు నిర్వహించటం జరుగుతుందని,ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని గ్రామ ప్రజలకు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడీ పిల్లలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక

మంగళవారం 16 -07- 2024

వరంగల్






# బోగస్ రీఫండ్‌లపై ఆదాయపు పన్ను అవగాహన సదస్సు

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : చాప్టర్-వి ఐ ఎ కింద తప్పుడు మినహాయింపులు మరియు తగ్గింపులను దాఖలు చేయడం వల్ల, కొంతమంది ఉద్యోగులు తప్పుడు రిఫండ్ స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా తప్పుడు ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలును నిరోధించేందుకు ఖమ్మంలోని ఆదాయపు పన్ను కార్యాలయంలో ట్యాక్స్ బార్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు. ఉమా మహేశ్వరరావు, ఆదాయపు పన్ను శాఖ అధికారి, ఖమ్మం సమావేశంలో మాట్లాడుతు " డేటా అనలిటిక్స్ ఆధారంగా తప్పుడు రిఫండ్ తీసుకున్నవ్యక్తులందరికీ నోటీసులు జారీ చేయబడతాయి. ఒక పర్యాయ చర్యగా, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్. 139(8ఏ) ప్రకారం అప్‌డేట్ చేసిన రిటర్న్‌లను ఫైల్ చేయాలని డిపార్ట్‌మెంట్ అభ్యర్థిస్తోంది. అప్‌డేట్ చేసిన రిటర్న్‌లను ఫైల్ చేయడంలో విఫలమైతే, చెల్లించాల్సిన పన్నులో 200% వరకు జరిమానాలు విధించవచ్చు మరియు తీవ్రమైన కేసుల్లో ప్రాసిక్యూషన్‌లు విధించవచ్చు" అని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్ మహేంద్ర చైతన్య, సీనియర్ ఆడిటర్లు మురళీకృష్ణ ప్రసాద్, కెఎస్ఆర్‌కె ప్రసాద్, రామకృష్ణ ,వి సైదులు తదితరులు మాట్లాడారు.

# ఎడతెరిపిలేని వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## - వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని అధికారులు అప్రమత్తంగా ఉండి తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు ఎంపీడీవోలు , మున్సిపల్ కమిషనర్లతో ఆయన ఫోన్లో మాట్లాడుతూ... వర్షాలపై తగు సూచనలు, చేశారు. మరో మూడు , నాలుగు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని ఎక్కడ కూడా ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పాత ఇండ్లల్లో, మట్టి మిద్దెలలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మురుగు కాలువలు శుభ్రం చేయించాలని , లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అంటు రోగాల బారినపడకుండా గ్రామాలు, పట్టణాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా విద్యుత్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలని , ఎక్కడైనా ఎలాంటి సమస్యలు తలెత్తిన తనతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# పారదర్శక పాలన అందించడానికి ప్రభుత్వం కృషి

## మంత్రి అచ్చన్నాయుడు

శ్రీకాకుళం, తెలంగాణ ముచ్చట్లు : ప్రజలకు పారదర్శక పాలన అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వంలో శాఖల సమన్వయంతో అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా నివ్మాడ క్యాంపు కార్యాలయంలో డీఆర్డీఏ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలకు, పశు పోషణ ప్రోత్సాహానికి నూరు శాతం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కమిషనరేట్ లో యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు

## - డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు

## - ఎన్‌ఫోర్స్‌మెంట్, డీ అడిక్షన్, ప్రి వెన్షన్ పైనా ప్రధాన దృష్టి

## - పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత భలోపేతం చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం నియంత్రణపై ఈ బృందాలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. ప్రధానంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, డీ అడిక్షన్, ప్రి వెన్షన్ పైనా ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీస్ శాఖ యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి సమాచారం వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. మాధకద్రవ్యాల క్రయ విక్రయాల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వాట్సప్ ద్వారా కాని సెల్ ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సమాచారం అందజేసేందుకు అందుబాటులో వుండే యాంటీ డ్రగ్ కంట్రోల్ విభాగం 8712659123 సెల్ ఫోన్ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం అందజేసిన వారి వివరాలకు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పల్లెల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘాతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. అటు గంజాయి వాడుతున్న వారిని సైతం గుర్తించి వైద్య సదుపాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ నుంచి రోడ్డు మార్గాల ద్వారా మత్తు పదార్థాలు రవాణా జరుగకుండా తనిఖీలు పటిష్ఠం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చెయ్యడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశం

## -జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్






ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా శక్తి పథకంపై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సులో అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎపీఎం లు, మరియు మహిళా సంఘ సభ్యులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సభ్యులు మరియు ఆఫీస్ బేరర్ లకు మహిళా శక్తి పథకం పై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు జీవనోపాధి కల్పించాలని, వారిని ఆర్థికంగా కోటీశ్వరులని చెయ్యాలి అనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకాన్ని జిల్లాల్లో విజయవంతంగా అమలుపరచాలని తెలిపారు. స్వయం సహకారక సంఘాల ద్వారా పలు రకాల పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళలు అభ్యున్నతికి ఈ పథకం తోడ్పడుతుందని ఆయన తెలిపారు. మహిళా సంఘాలు వారు ఏర్పాటు చేసే ప్రతి పరిశ్రమ పైన అవగాహన మరియు ధైర్యం ఉంటేనే వారు విజయం సాధిస్తారని తెలిపారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసే చిన్న పరిశ్రమలు వాటి ద్వారా తయారయ్యే వస్తువుల మార్కెట్ మరియు ప్రజల అవసరమైన వస్తువులు చేయడం ద్వారా విజయం సాధించవచ్చని సూచించారు. సంఘాలు స్థాపించే చిన్న పరిశ్రమలు పూర్తి నాణ్యత పాటిస్తూ, ఆకర్షణీయమైన ముద్ర రూపొందించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలు చిన్న పరిశ్రమలైన పెరటి కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, ఆ జోల పెంపకం, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కుట్టు మిషన్ కేంద్రాలు, మీసేవ కేంద్రాలు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు మరియు డబ్బా వాలా కేంద్రాలు తదితర చిన్న పరిశ్రమలు స్థాపించడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. మహిళా సంఘంలోని గ్రూప్ సభ్యులందరూ సమన్వయంతో కృషిచేసి అభివృద్ధి సాధించాలని తెలిపారు. సంఘాలు ఏర్పాటు చేసే ప్రతి పరిశ్రమ లో ఎంత ఆదాయం వస్తుంది అనే అంచనా వేసుకోవాలని ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు ఏదైనా చిన్న పరిశ్రమల స్థాపనకు కావలసిన శిక్షణ కూడా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని మండలాల ఎంపీడీవోలు,ఏ పి ఎం లు వారి లక్ష్యాల కోసం మహిళా సంఘాలపై ఒత్తిడి తేవద్దని వారికి అవగాహన ఉన్న పరిశ్రమల ఏర్పాటుపై ప్రోత్సహించాలని సూచించారు. రానున్న సంవత్సర కాలంలో జిల్లా లక్ష్యం వ్యవసాయం,చేపల పెంపకం, పాడి పరిశ్రమ మరియు కోల్డ్ స్టోరేజ్ ప్రయోగాత్మకమైన పద్ధతుల ద్వారా అభివృద్ధి సాధించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విద్యాచందన, జడ్పీ సీఈవో చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి పురందరేశ్వర్ మరియు అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీఎం, మహిళా సంఘ సభ్యులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

# భారాసాను వీడిన మరో ఎమ్మెల్యే

## - కాంగ్రెస్‌లో చేరిన గూడెం మహిపాల్ రెడ్డి

## - కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : భారాసకు మరో షాక్ తగిలింది. మరో ఎమ్మెల్యే పార్టీని వీడారు. ఆ పార్టీ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకొన్నారు. ఆయనతోపాటు జహీరాబాద్ భారాస ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కూడా హస్తం గూటికి చేరారు. మహిపాల్‌రెడ్డి 2014 నుంచి వరుసగా మూడుసార్లు భారాస నుంచి గెలుపొందారు. ఇప్పటికే భారాస నుంచి కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలేరు యాదయ్య, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, సంజయ్, కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి పలువురు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

# కాళేశ్వరం లోపాలపై విచారణ

## - జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ దూకుడు

## - కమిషన్ ముందు స్మితా సబర్వాల్ తదితరులు హాజరు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం) దాదాపు 10మంది ఐఏఎస్‌లను విచారించింది. కమిషన్ ఎదుట స్మితా సబర్వాల్, రజత్ కుమార్, వికాస్ రాజ్, రామకృష్ణారావు, రాహుల్ బొజ్జా, ఎస్.కె.జోషి, కంచర్ల రఘు హాజరయ్యారు. ఇందులో పలువురు తాజా, మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక నిర్ణయాలు, అమలు చేసిన విధానాలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వారిని ప్రశ్నించింది. నిర్మాణ లోపాలపై కీలక ప్రశ్నలను చంద్రఘోష్ కమిషన్ వారికి సంధించింది. దీనిపై ఐఏఎస్ అధికారులు వివరణ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులపై తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరు తదితర వివరాలను కమిషన్‌కు వివరించారు. నంతరం ఇప్పటివరకు చెప్పిన వివరాలను అఫిడవిట్ రూపంలో వారం రోజుల్లోగా సమర్పించాలని కమిషన్ ఆదేశించగా.. విచారణకు పూర్తిగా సహకరిస్తామని ఐఏఎస్, మాజీ ఐఏఎస్‌లు చెప్పారు. అయితే తెలంగాణ బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో మరింత గడువు కావాలని ప్రస్తుత ÷నాన్స్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు కోరారు. దీంతో ఆగస్టు 5లోపు అఫిడవిట్ సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. విచారణకు స్మితా సబర్వాల్, రజత్ కుమార్, వికాస్ రాజ్, రామకృష్ణారావు, రాహుల్ బొజ్జా, కంచర్ల రఘు ప్రత్యక్షంగా హాజరు కాగా.. ఎస్.కె.జోషి మాత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. మాజీ సీఎస్ సోమేష్ కుమార్ సైతం ఇవాళ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట హాజరుకానున్నారు.

# కాటమ్మ పథకం కెసిఆర్ ప్రభుత్వానిదే

## అప్పట్లోనే 15కోట్లు కేటాయించామన్న మాజీమంత్రి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : కాటమయ్య రక్షణ కవచం పథకం కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన కాటమయ్య మోకులు మాజీ సీఎం కేసీఆర్ హయాంలో తయారైనవే అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విధించిన కోడ్ వల్ల అప్పుటి బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని లబ్దిదారులకు ఇవ్వలేకపోయినట్లు ఆయన చెప్పారు. మోకుల తయారీకి కేసీఆర్ ప్రభుత్వంలోనే రూ.15కోట్లు మంజూరు చేసినట్లు శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెడతామని చెప్పారు, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. బీసీ ఆత్మ గౌరవ భవనాలను పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని హితవు పలికారు. కల్లు దుకాణాలకు శాశ్వత లైసెన్సులు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీని వెంటనే నెరవేర్చాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. గీత కార్మికుల పెన్షన్ రూ.4వేలకు పెంచాలని, అలాగే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ.10లక్షలు చేయాలని, ద్విచక్రవాహనాలు(మోపెడ్) వెంటనే వారికి ఇవ్వాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# అక్రమ అరెస్టులు ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపలేరు

## వనపర్తి బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** హైదరాబాదులో నిరుద్యోగుల శాంతియుత ధర్నాకు మద్దతుగా వెళుతున్న పెద్దమందడి బిజెపి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పెద్దమందడి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు అశ్విని రాధా మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాన్ని ఖండిస్తూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు పిలుపుమేరకు నిరుద్యోగుల శాంతియుత ధర్నాకు బయలుదేరుతున్న బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం , అరెస్టులతో ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపలేరని, కాంగ్రెస్ ప్రభుత్వా హేయమైన చర్య అని మండిపడ్డారు. రాష్ట్రంలో గ్రూప్ 2 డీఎస్సీ పరీక్షలు వెనుక వెనుక నిర్వహించడం ద్వారా నిరుద్యోగులు చాలా నష్టపోతున్నారని అలాగే తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ గాంధీనగర్లో నిరుద్యోగులు శాంతియుతంగా చేస్తున్న ధర్నాను కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై పోలీసులతో లాఠీ ఛార్జ్ చేయించడాన్ని ఖండిస్తూ నిరుద్యోగులకు మద్దతుగా వెళ్లే నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేస్తుంది గత ప్రభుత్వాలు విద్యార్థులపై అక్రమ కేసులు లాటి చార్జీలు చేసిన ప్రభుత్వాలు కనుమరుగైపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో నడుస్తూ భవిష్యత్తులో కనుమరుగు కావాల్సిందేనని హెచ్చరించారు అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను జాబ్ క్యాలెండర్ ను రెండు లక్షల ఉద్యోగాలను మెగా డీఎస్సీ ని వెంటనే ప్రకటించాలని బీజేపీ జిల్లా మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వనపర్తి బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ పెద్దమందడి మండల వైస్ ప్రెసిడెంట్ కిషన్ నాయక్ జిల్లా ఎస్టీ మోర్చా కార్యదర్శి మోహన్ నాయక్ భూత అధ్యక్షుడు కర్ణాకర్ సీనియర్ నాయకులు ఇరమోణి మహేష్ జి శంకర్ మార్ష ధర్మ రాములు నందిమల్ల సురేష్ కొత్త రామకృష్ణ బండల శివ గొడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ను సందర్శించిన జిల్లా కలెక్టర్







**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సందర్శించారు. సోమవారం జల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ క్లాస్ రూంలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. తాను ఐ.ఎ.ఎస్ స్థాయి కి ఎదగడానికి పడిన కష్టాలను విద్యార్థులకు వివరించారు. చదువు తో పాటు ఆటల్లో కూడా ముందుండాలని కలెక్టర్ అన్నారు. ఒక్కసారి పరీక్షలో పెయిల్ అయినా మరోసారి ప్రయత్నించాలన్నారు. కష్టం వచ్చినప్పుడు ధైర్యం కోల్పోకుండా ఉండాలని ఆయన తెలిపారు. పాఠశాలకు కావల్సిన మౌళిక సదుపాయాల గురించి కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు డి. రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వెను వెంటనే దరఖాస్తులను పరిష్కరించాలని అది కారులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు లో. ఎంతో దూరం నుంచి సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తూ వస్తున్న బాధితులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశం మదిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. స్వయంగా ఒక్కొక్కరీ దరఖాస్తులను పరిశీలించి అప్పటికప్పుడే అధికారులకు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని పెండింగ్ లో పెట్టవద్దని, వార వారం ఫిర్యాదులు పరిష్కరించి. సంబంధిత అధికారులు ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో నివసిస్తున్న గోపోజు సురేష్ వికలాంగుల కోటా కుటుంబ పోషన, జీవనోపాధి కొరకు కిరాణం షాపు పెట్టుకోవడం కోసం ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోరుతూ కలెక్టర్ కు వినతి సమర్పించారు. అదేవిధంగా గాదెగాని సునీత వికలాంగురాలు ఉపాధికోసం కిరాణ షాపుకు అనుమతికి ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు అందించారు. అట్టి వినతులను ఎస్సీ కార్పోరేషన్ అధికారులకు పంపడం జరిగింది. కొణిజర్ల మండలం గద్దలగూడెం తమ్మినేని సీతారాములు 2022-23 ఉపసర్పంచ్ గా ఉన్న కాలంలో చేసిన పనులకు స్టేట్ డెవలప్మెంట్ ఫండ్ నిధులు ఇప్పించమని సమర్పించిన దరఖాస్తుకు సంబంధిత పంచాయతీరాజ్ అధికారులకు పంపడం జరిగింది. బోనకల్లు మండలం ఆళ్ళపాడు రెవిన్యూ గ్రామ సర్వే నెం. 338, 339 చేబ్రోలు రాజగోపాలం, చేబ్రోలు కృష్ణయ్యలకు వారసత్వంగా సంక్రమించిన భూమిని ప్రభుత్వ రికార్డు లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకములు ఇప్పించవలసిందిగా కోరుతూ వినితి సమర్పించారు. అలాగే బోనకల్లు మండలం పెద్దబీరవల్లి రెవెన్యూ రికార్డు లో ఉన్న సర్వే నెం. 90/అ/1 లో ఉన్న 29 కుంటల భూమి తగాదాలను పరిష్కారించాలని సాధం శ్రీనివాసరావు కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఇట్టి వినతులను సంబంధింత రెవెన్యూ అధికారులకు పంపడం జరిగింది. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల పేరుతో వేలకోట్ల స్కామ్

## - నిరుద్యోగులతో రాజకీయ డ్రామాలు
## - పాలమూరును ముంచిన కెసిఆర్
## - మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి




**మహబూబ్‌నగర్, జూలై 15 తెలంగాణ ముచ్చట్లు :** బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులతో రాజకీయాలు చేయాలని చూస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంటట్ రెడ్డి మండి పడ్డారు. తాము మంచి చేయాలని చూస్తుంటే అడ్డుకుంటున్నారని అన్నారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ నిరుద్యోగుల గురించి ఎప్పుడు మాట్లాడలేదని ఇప్పుడు డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు మంచి చేయాలని చూస్తుంటే తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. పాలమూరు, కొడంగల్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరలోనే వాటిని పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో నలుగురు ఎమ్మెల్యేలే మిగులుతారని మిగిలినవారంతా కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతారని చెప్పారు. కరీంనగర్ లో ఓడిపోతానని తెలిసి కేసీఆర్ మహబూబ్ నగర్ నీటిని కరీంనగర్ కు తరలించాడని ఆరోపించారు. రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరుకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రాజెక్టుల పేరిట కోట్ల రూపాయల స్కాంకు కేసీఆర్ తెరతీశారని అన్నారు. హరీష్ రావు, కేటిఆర్ లు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మహబుబ్‌నగర్‌కు మంచి రోజులు తెస్తామని చెప్పారు. ఎవరెన్ని చేసినా తాము ఇచ్చిన హామీలను నెరవేర్చే ముందుకు వెలుతున్నామన్నారు. కొడంగల్ కు బీఆర్ఎస్ నిధులు ఇవ్వలేదని కానీ ఈరోజు కొడంగల్‌కు వరాల జల్లు కురుస్తోందని చెప్పారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నామని చేసిన తప్పుకు అందరూ శిక్ష అనుభవించాల్సిందేనని రాబోయే రోజుల్లో చట్టం తన పని తాను చేసుకుపోతోందని చెప్పారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ప్రాజెక్టుల పేరిట మాజీ సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయల స్కాం కు తెరలేపారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆయనకు రాజకీయ బిక్ష పెట్టిన పాలమూరుకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ భారీ అప్పుల ఊబిలో నెట్టివేశారని ఫైర్ అయ్యారు. రోజు ప్రభుత్వ ఉద్యోగులకు తమ ప్రభుత్వంలో మొదటి తారీఖున జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. మహబుబ్ నగర్ జిల్లా ప్రజలను మోసం చేసి పక్క రాష్ట్రాలకు పంపి వారిని లేబర్‌గా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లాలో కట్టిన ఒక్క ప్రాజెక్టు పాలమూరుకు ఉపయోగ పడలేదని మండిపడ్డారు. మహబుబ్ నగర్ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు. 0 బిల్లులతో ప్రతి పేదవాడికి కరెంట్ బిల్లులు లేకుండా చేస్తున్నామని వివరించారు. భద్రాచలం రాముల వారి సన్నిధి నుంచే ప్రతి పేదవాడికి రూ. 5లక్షలతో డబుల్ బెడ్ ఇల్లు కేటాయించే కార్యక్రమాన్ని చేపడుతామని ప్రకటించారు.

# బిజెపి,బిఆర్ఎస్ రహస్య ఒప్పందం

## కవితకు బెయిల్ కోసమేనన్న ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర దించుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఢిల్లీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు బీజేపీతో సంప్రదింపులు జరిపారని అన్నారు. కవిత బెయిల్ కోసమే బీజేపీకి బీఆర్ఎస్ నేతలు స్నేహ హస్తం అందిస్తున్నారని చెప్పారు. హరీష్ రావు ప్రజా నేత అని బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ డబ్బాలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. నిన్నటి దాకా హరీష్ రావుపైన దుమ్మెత్తిపోసిన బీజేపీ నేతలు ఇప్పుడు పొగుడుతున్నారని అన్నారు. హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరఫున పోటీ చేయించే ఆలోచన ఉన్నట్లు కనిపిస్తోందని అన్నారు. అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా సిద్దిపేటలో హరీష్ రావు మళ్లీ గెలుస్తాడని బండి సంజయ్ అంటున్నారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ పైన ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. విలీనానికి కేసీఆర్ ఒప్పుకోకపోతే హరీష్ రావు ను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌ను చీల్చే అవకాశాలున్నాయని చెప్పారు. మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండే ప్రయోగాన్ని తెలంగాణలో బీఆర్ఎస్ పైన బీజేపీ చేస్తుందనే అనుమానాలున్నాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడం కోసమే రెండు పార్టీలు ముసుగు తీసి వస్తున్నాయని విమర్శించారు. బండి సంజయ్, హరీష్ రావు ప్రజా నేత అని చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు. మెదక్‌లో బీజేపీ గెలుపు కోసం లోపాయికారీ ఒప్పందం జరిగినట్లు బండి సంజయ్ వ్యాఖ్యలు చూస్తుంటే అర్థమవుతుందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటైనా తెలంగాణలో కాంగ్రెస్‌కు ఇబ్బంది లేదని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# పదేళ్ల పాటు నిరంకుశ పాలన చేసి ఇప్పుడు నీతులా ?

## - కెసిఆర్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి
## - కృత్రిమ ఉద్యమాలతో విద్యార్థులను రెచ్చగొట్టే కుట్రలు
## - ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : పదేళ్లుగా తెలంగాణలో నిరంకుశ పాలన నడిచిందని.. కేసీఆర్ ఇనుప కంచలు వేసి ప్రగతి భవన్ రానీయకుండా చేశారని తెలంగాణ ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి అన్నారు. బుల్డోజర్లు పెట్టి రేవంత్ రెడ్డి ఇనుపకంచెలు తొలగించారని తెలిపారు. కృత్రిమ ఉద్యమాలను మాజీ సీఎం కేసీఆర్ సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. 30 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ సెంట్రల్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రధాన ప్రాధాన్యతగా ప్రభుత్వం ముందుకెళ్తుందని వివరించారు. గత ప్రభుత్వం ఖజానా పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిపోయిందని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం ఎంతో గొప్పగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని.. దీన్ని ఆలోచించాలని అన్నారు. విద్యార్థులు తప్పుడు మాటలు వినద్దొని. తప్పుదోవ పట్టద్దొని చెప్పారు. ఈ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా ఉంటుందని మాటిచ్చారు. నిరుద్యోగ యువకులు కొందరి ప్రొద్బలం వల్ల ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు రెచ్చ గొట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని హితవు పలికారు. విద్యార్థుల బలిదానం, త్యాగాలను గుర్తించి తెలంగాణను ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చారని గుర్తుచేశారు. సోమవారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో చిన్నారెడ్డి పలు కీలక విషయాలు వెల్లడించారు. లక్ష 7వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆ రోజు మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని తెలిపారు. వాటిని భర్తీ చేయక ఆయన దిగిపోయే నాటికి చనిపోయే వాటిని కలుపుకుంటే రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. నిరుద్యోగుల పైన ప్రేమ ఉంటే ఉద్యమంలో విద్యార్థుల ప్రాణత్యాగలతో తెచ్చుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి అయిన మూడు నెలల్లోనే కేసీఆర్ ఉద్యోగాలు నింపి ఉండేవారని.. కాని ఉద్యోగాలు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలో యూనివర్సిటీల్లో టీచింగ్ స్టాఫ్ లేదని అన్నారు.ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ట దెబ్బతినేలా కేసీఆర్ సర్కార్ చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గ్రూప్ వన్ నోటిఫికేషన్ వచ్చిందని, పరీక్షలు రాశారని రిజల్ట్స్ కూడా వచ్చాయని తెలిపారు. మెయిన్స్ షెడ్యూల్ కూడా ఇచ్చామని తెలిపారు.శతాబ్ది ఉత్సవాలకు కేసీఆర్‌ను ఉస్మానియాలో యూనివర్సిటీ విద్యార్థులు మాట్లాడనివ్వలేదని గుర్తుచేశారు. ఎన్నికల కంటే ముందు రెండు లక్షల ఉద్యోగాలను ఒక సంవత్సరంలో భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు. పదేళ్లలో 20,000 టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఒక్కటి కూడా గత ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఒక్క డీఎస్సీ కూడా వేయలేదు.. పక్కన ఏపీ రాష్ట్రంలో మూడు డీఎస్సీలు వేశారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాల్లో విద్యార్థులకు బీఆర్ఎస్ సర్కార్ అన్యాయం చేసింది. సర్కార్ రాగానే రేవంత్ రెడ్డి ఉద్యోగాలపై దృష్టి సారించారు. నిరుద్యోగుల కోసం 11 వేల పైచిలుకు పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారు. హాల్ టికెట్లు కూడా విడుదల చేశారు. గత సర్కార్ పదేళ్లలో 5000 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిర్వహించలేకపోయింది. ఈ డీఎస్సీతో పాటు మరో డీఎస్సీని 9,000 తో విడుదలకు నోటిఫికేషన్ ఇస్తాం. క్వాలిటీ టీచర్స్ ఎంపిక కోసం రెండు డీఎస్సీలను నిర్వహించాలనుకుంటున్నాం అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణను పూర్తిగా దోచుకొని దివాలా తీయించిన బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ మళ్లీ పిల్లల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ల చేతుల్లో పావులుగా మారొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. మళ్లీ విద్యార్థులను నిరుద్యోగులను వాడుకొని వదిలేస్తారు. 30 లక్షల మంది చదువుకున్న నిరుద్యోగులు ఎంలాయిమెంట్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. టాటా కంపెనీతో ఒప్పందం చేసుకొని 64 ఐటీఐ సెంటర్లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాం. రూ. 2000 కోట్లు ఐటీఐలకు కేటాయించాం. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కలిపి 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఇంటికి పోయి ధర్నా చేయడం సరికాదని విజ్ఞప్తి చేస్తున్నాను. కోచింగ్ సెంటర్ల వాళ్లు కొంతమంది విద్యార్థులను ప్రేరేపించి ఆందోళన చేయిస్తున్నారు. ప్రజావాణిలో దరఖాస్తులకు దరఖాస్తు చేసిన 10 రోజుల్లో ఫలితాలు కూడా వస్తున్నాయి. అవసరమైతే అధికారులను అక్కడికి రప్పిస్తున్నాం. విద్యార్థులు, నిరుద్యోగులు బాధ చెప్పుకోవాలనుకుంటే ప్రజావాణికి వచ్చి బాధ చెప్పుకోమని కోరుతున్నాం.. మీకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరుతున్నాను. 1: 100, వాయిదా వేయడం, పరీక్షకు పరీక్షకు మధ్య గ్యాప్ వంటి సమస్యలపై కలిసి మాట్లాడితే బాగుండేది. ఫీజు రియింబర్స్‌మెంట్ మొత్తం కూడా త్వరలోనే విడుదల చేయబోతున్నాం అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# డ్రగ్స్ నిందితుల్లో రకుల్ ప్రీత్ సోదరుడు

## అమన్ ప్రీత్ సింగ్ సహా ఐదుగురి అరెస్ట్




హైదరాబాద్,జూలై15తెలంగాణ ముచ్చట్లు : హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నాం జరిగిన ఆపరేషన్‌లో ఐదుగుర్ని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి డ్రగ్స్ సీజ్ చేయడంతో పాటు నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ తీసుకున్న వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని టెస్టులు జరిపారు. వీరిలో అమన్ ప్రీత్ సింగ్ సహా ఐదుగురికి పాజిటివ్ గా తేలింది. అమన్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సోదరుడు అని ఈ డ్రగ్స్ కేసు తెలంగాణలో సంచలనం రేపుతోంది. టాలీవుడ్ కు లింక్స్ ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డ్రగ్స్ గురించి తెలిసినా, ఏమైనా అనుమానం వచ్చినా 8712671111 నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి, డ్రగ్స్ లేని సమాజం కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కేసు వివరాలను రాజేంద్రనగర్ డీసీసీ సీహెచ్ శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. రాజేంద్రనగర్ డీసీసీ మాట్లాడుతూ.. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సైబరాబాద్ ఎస్వోటీ, రాజేంద్రనగర్ పరిధిలోని నార్సింగి పోలీసులు ఓ ప్లాట్‌పై రైడ్ చేశారు. డ్రగ్స్ కు సంబంధించి మొత్తం ఐదుగుర్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టైన వారిలో ఇద్దరు నైజీరియన్లు, ఇద్దరు ఇక్కడి వారు ఉన్నారని చెప్పారు. నిందితుల వద్ద నుంచి 199 గ్రాముల కొకైన్ సీజ్ చేసినట్లు తెలిపారు. నైజీరియా వాళ్ల పాస్ పోర్ట్ లతో పాటు వారి వద్ద నుంచి రెండు టూవీలర్లు, మొబైల్స్ సీజ్ చేశారు. ÷-రగ్స్ రాకెట్ నడిపింది డివైన్ అబుకా సుజి అనే నైజీరియాకు చెందిన వ్యక్తి. ప్రస్తుతం ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. అతడి అనుచరులు ఓనౌహ ÷-లబెస్సింగ్ అలియాస్ జోనా గోమ్స్ అనే మహిళను అరెస్ట్ చేశారు. దూల్ పేటలో డ్రగ్స్ కేసులోనూ అరెస్టై బెయిల్ మీద విడుదలైనట్లు తెలిపారు. ఫేక్ పాస్ పోర్ట్ తయారు చేసి డ్రగ్స్ తీసుకొచ్చింది ఈమెనె అని పోలీసులు స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులకు భంగం

## - ప్రోటోకాల్ పాటించకుండా అవమానం
## - సబితా ఇంద్రారెడ్డి ఘటపై స్పీకర్‌కు కెటిఆర్ లేఖ

హైదరాబాద్,జూలై15 తెలంగాణ ముచ్చట్లు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారాస ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని, కావాలనే విపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తోందని భారాస నేత కేటీఆర్ ఆక్షేపించారు. ప్రోటోకాల్ ఉల్లంఘటనలకు సంబంధించి ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రతి సందర్భంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించైనా ప్రోటోకాల్ ఉంటుంది. కాంగ్రెస్ నాయకులుకావాలని భారాస ఎమ్మెల్యేలను అవమానించే లా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలను కాదని, కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారు. హుజూరాబాద్, మహేశ్వరం, అసిఫాబాద్ సహా భారాస ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇలాగే జరుగుతోంది. శాసనసభ్యుల హక్కులు, వారికి ప్రోటోకాల్ పరిరక్షణ, గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత శాసనసభాపతిదే అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో సభాపతి అధికారాలను వినియోగించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు వెంటనే సీఎస్ సహా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 'మూడుసార్లు మంత్రి, ఐదు సార్లు ఎమ్మెల్యే అయిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మ రాజ్యంలో గౌరవం లేదా? ప్రజలు గెలిపించిన నాయకులకు విలువ లేదా?' అని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని విస్మరించి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, మూడోస్థానానికి పరిమితమైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అధికార యంత్రాంగం సెల్యూట్ కొట్టడం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించిన ఆయన.. ప్రోటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధులకు జరుగుతోన్న అవమానం పట్ల స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఏఐసీసీ డైరెక్షన్ మేరకే చేరికలు

## - ఫిరాయింపులకు వ్యతిరేకమైనా అనివార్యం
## - దళితులకు వ్యతిరేకంగా మోదీ, కేసీఆర్ కుట్రలు
## - మాజీ ఎంపి, కాంగ్రెస్ నేత మధుయాష్కీ

హైదరాబాద్,జూలై15తెలంగాణ ముచ్చట్లు : ఏఐసీసీ డైరెక్షన్ మేరకే చేరికలు జరుగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్టీ ఫిరాయింపులకు పార్టీ వ్యతిరేకమైనా తెలంగాణలో అనివార్య మైందని తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వస్తాం అనుకున్నామని చెప్పారు. మంత్రి పదవులు ఇస్తామని ఎవరికీ చెప్పలేదని అన్నారు. కాంగ్రెస్ గెలిచిన మూడు రోజులకే సర్కార్ కూలిపోతుందని బీఆర్ఎస్ నేతలు అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ అహంకారంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారని అన్నారు. అంబేద్కర్ పేరుమీదున్న ప్రాణహిత చేవెళ్లను కాదని కాళేశ్వరం కట్టారని చెప్పారు. దళిత నేత భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు ఆ హోదా పోయేలా కేసీఆర్ చేశారని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మధుయాష్కీ మీడియాతో మాట్లాడుతూ.. దళితులకు వ్యతిరేకంగా మోదీ, కేసీఆర్ పనిచేశారని ధ్వజమెత్తారు.తాము ఎమ్మెల్యేలను పైసలిచ్చి కొనుకోవడం లేదని స్పష్టం చేశారు. వేరే పార్టీలో గెలిచిన వారికి బీజేపీ ఇతర రాష్ట్రాల్లో మంత్రి పదవులు ఇస్తుందని చెప్పారు. పీసీసీ చీఫ్ ఎంపికపై ఢిల్లీలో అసలు చర్చ జరగలేదు. మంత్రి వర్గ విస్తరణపై జరిగింది. ఎవరెవరికి మంత్రి పదవులివ్వాలి. ఏ శాఖలు ఇవ్వాలనేదానిపై చర్చ జరిగింది. అదేరోజు పీసీసీపై ఐదు నిమిషాలు చర్చించి పక్కకు పెట్టారు. కొందరు మంత్రులు కూడా తమకు సరైన శాఖలు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. మంత్రులపై సమన్వయం చేసే దానిపై చర్చ జరిగింది. కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పాత్ర ఏమి లేదు. కార్పొరేషన్ చైర్మన్ల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీదర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులు కేసుల నుంచి తప్పించాలని కోరుతున్నారు. దానికి ప్రతిఫలంగా రూ.100 కోట్లు ఇస్తామని తిరుగుతున్నారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దల చుట్టూ అవినీతి అధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కేసీఆర్ తప్పు చేయకపోతే కమిషన్‌ను రద్దు చేయాలని సుప్రీం కోర్టుకు ఎందుకు వెళ్లారని మధుయాష్కీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో 50 ఏళ్లకు పైగా ఉన్నాను. నేను ఏ పార్టీ మారలేదు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను. ఎమ్మెల్సీ కవిత విడుదలపైనే బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. కవిత విడుదల కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను మెర్జ్ చేయాలని కేసీఆర్, కేటీఆర్ చూస్తున్నారు. దానిపై ఢిల్లీలో మంతనాలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీష్ రావుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రేమ ఒలకపోయాడానికి అదే కారణం. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై కేంద్ర బీజేపీ ఒకే చెబుతున్నా, స్టేట్ బీజేపీ నేతలు వద్దంటున్నారు. అవసరమైతే కొందరు బీఆర్ఎస్ నేతలను పార్టీలో చేర్చుకోవాలని జాతీయ బీజేపీ నాయకులు అంటున్నారు' అని మధుయాష్కీ తెలిపారు. కేసీఆర్ మంత్రులకు కూడా అపాయింట్మెంట్ ఇవ్వలేదు. గతంలో హోం మంత్రి మహమ్మద్ అలీ ప్రగతిభవన్‌కు పోతే హోం గార్డుతో వెనక్కి పంపించారు. ప్రజలు విసిగి వేసారిపోయి కాంగ్రెస్ పార్టీకు అధికారం ఇచ్చారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ సీఎం అయితే కేసీఆర్ ఓర్వడం లేదు.రేవంత్‌పై అసూయతో కుట్ర చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి రేవంత్, నేను చాలా కష్టపడ్డాం. నేను నేరుగా అమెరికా నుండి వచ్చి ఎన్నికల్లో పోటీ చేయలేదు. నేను విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉన్నాను' అని మధుయాష్కి పేర్కొన్నారు.

# ఇక ఆన్‌లైన్‌లో సిఎం రిలీఫ్ ఫండ్

## అమల్లోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం

హైదరాబాద్,జూలై15తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను ఆన్‌లైన్ స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తోంది. అందులో భాగంగా ఆన్‌లైన్ లింక్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకోసం స్థానిక మంత్రి, ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలకు లాగిన్ ఐడీని ప్రభుత్వం కేటాయించింది. వారి వద్దకు వెళితే సిఎంఆర్ఎఫ్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పేషెంట్ల వివరాలు నమోదు చేస్తారు. బాధితులు సమర్పించిన సర్టిఫికెట్లు సరైనవా? కాదా అనే వివరాలను తెలుసుకోవడానికి పోర్టల్‌లో ప్రత్యేక విధానాన్ని ఏర్పాటు చేశారు. తాజాగా సిఎంఆర్ఎఫ్ పారదర్శకంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సిఎంఆర్ఎఫ్ నిధుల మళ్లీంపు నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక నుంచి ముఖ్యమంత్రి ప్రావిడెంట్ ఫండ్ దరఖాస్తులను ఈ వెబ్‌సైట్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్థానిక మంత్రి, ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలు సిఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలను తీసుకుని వారి సిఫార్సు లేఖను అప్‌లోడ్ చేస్తారు. దరఖాస్తులో సంబంధిత దరఖాస్తుదారు బ్యాంకు ఖాతా నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయనున్నారు. దరఖాస్తును అప్‌లోడ్ చేసిన తర్వాత సిఎంఆర్ఎఫ్‌కి సంబంధించిన కోడ్ ఇస్తారు.ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సెక్రటేరియట్‌కు సమర్పించాలి. నిర్ధారణ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు సంబంధిత ఆసుపత్రులకు పంపిస్తారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే, సిఎంఆర్ఎఫ్ దరఖాస్తు ఆమోదిస్తారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

# గత ప్రభుత్వ పాలనలో పోలవరం విధ్వంసం

- గత ఐదేళ్ల హయాంలో నీటిపారుదల శాఖ 20 ఏళ్లు వెనక్కి..
- 2019లో ప్రభుత్వం మారడమే పోలవరం ప్రాజెక్టుకు శాపం..
- సాగు, తాగునీటి రంగాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది..
- పోలవరం పర్యటన, వరుస సమీక్షలు చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం..
- నదుల అనుసంధానానికి, రైతాంగ సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎనలేని కృషి..
- ఇకపై ఏటా పద్మభూషణ్ డా.కె.ఎల్.రావు, సర్ ఆర్థర్ కాటన్, మోక్షగుండం, శ్రీరామకృష్ణయ్య జయంతోత్సవాలు..
- డా. శ్రీ నిమ్మల రామానాయుడు, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రివర్యులు





విజయవాడ తెలంగాణ ముచ్చట్లు : గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి గురైందని, వారి నిర్లక్ష్యంతోనే డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రివర్యులు డా. శ్రీ నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం విజయవాడలోని కె.ఎల్.రావు ఘాట్ లో రాష్ట్ర జలవనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పద్మభూషణ్' డా. కానూరి లక్ష్మణరావు 122వ జయంతి వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డా.కె.ఎల్.రావు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానాన్ని ప్రతిపాదించిన దార్శనికుడు, తెలుగుజాతి గర్వించదగిన ఇంజనీరు, 'పద్మభూషణ్' డా. కానూరి లక్ష్మణరావు అని, ఆయన జయంతి వేడుకలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. నీటి పారుదల రంగానికి విశేష సేవలు అందించి, భావితరాలకు స్ఫూర్తిగా నిలిచిన సర్ ఆర్థర్ కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, డా.కె.ఎల్.రావు, శ్రీరామకృష్ణయ్య వంటి మహనీయుల జయంతి వేడుకలను 2014-2019 ప్రభుత్వ పాలనలో ఎంతో ఘనంగా నిర్వహించామని తెలిపారు. అయితే, గత ప్రభుత్వ పాలనలో సాగు, తాగునీటి రంగాలకు విశేష సేవలు అందించిన మహనీయుల జయంతి కార్యక్రమాలను నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. నాగార్జున సాగర్ రూపశిల్పి, కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేసిన కె.ఎల్.రావు విగ్రహానికి కనీసం రంగు వేసిన పాపాన కూడా పోలేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో వారు చూపిన నిర్లక్ష్యంతోనే పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందన్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. గౌరవ సీఎం చంద్రబాబు తొలి పర్యటనగా పోలవరం వెళ్లారని, ప్రతి సోమవారం పోలవరంపై సమీక్షలు నిర్వహిస్తున్నారని ఇది ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**జల భారత భాగ్యవిధాత.. అపర భగీరథుడు.. డా.కె.ఎల్. రావు..**

నీటిపారుదల రంగంలో దేశాన్ని డా.కె.ఎల్. రావు తన దేశభక్తి, మేధాసంపత్తితో స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దారని తెలిపారు. గ్రావిటీ డ్యాములు, ఆర్చి డ్యాములు, కాంక్రీట్ డ్యాములు, రాతి ఆనకట్టలు, విద్యుదుత్పాదక కేంద్రాలు, పులిచింతల వంటి ఎన్నో బహుళార్థక సాధక ప్రాజెక్టుల నిర్మాణాలు ఎటువంటి విదేశీ నిపుణుల సహకారం లేకుండా రూపొందాయంటే అది కె.ఎల్.రావు ఘనతే అని కీర్తించారు. చంబల్ లోయలోని ఆనకట్టలు, మహానది మీద హిరకుడ్, గంగానది మీద ఫరక్క బ్యారేజ్, తరచూ వరదలతో బీభత్సం సృష్టిస్తూ భారత దుఃఖ నదిగా పేరుబడ్డ దామోదర నదిపై కోసీ బ్యారేజ్, తపతీ నది మీద ఉకై, కర్ణాటకలో సర్వాధి ప్రాజెక్ట్, మేఘాలయలో ఉనియం, కృష్ణా నది మీద శ్రీశైలం, నాగార్జున సాగర్ ఆనకట్టల నిర్మాణాలకు ఆద్యులు అపరభగీరథుడు కె.ఎల్.రావు అని వివరించారు. అటువంటి మహనీయుని సేవలను గుర్తు చేసుకుంటూ చంద్రబాబు, పవన్, మోదీ కూటమి ప్రభుత్వంలో నేడు 122వ జయంతి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కె.ఎల్.రావు కలల సాకారం దిశగా సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారని, నదుల అనుసంధానానికి పెద్దపీట వేసేలా పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. పోలవరం 7 ముంపు మండలాలను ఏపీలో విలీనం చేసేందుకు ఎంతో శ్రమించారని, ఆ 7 ముంపు మండలాల వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని గుర్తు చేశారు.

**2019లో ప్రభుత్వం మారడం పోలవరానికి శాపం..**

2014-19 ప్రభుత్వ కాలంలోనే పోలవరం పనులను 72 శాతం చంద్రబాబు పూర్తి చేశారన్నారు. కానీ 2019లో ప్రభుత్వం మారడం పోలవరం ప్రాజెక్టుకు శాపం అయ్యిందన్నారు. ఏజెన్సీలను మార్చడం, రద్దు చేయడం వంటి కార్యక్రమాలతో దాదాపు 13 నెలలు ప్రాజెక్టులో పనులు చేయకుండా ఖాళీగా ఉంచారన్నారు. ఐఐటీ హైదరాబాద్ నిపుణులు కూడా గత ప్రభుత్వ విధ్వంసం మీద, నష్టాల మీద రిపోర్టు కూడా ఇచ్చారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యధోరణితో నెలకొన్న సవాళ్లను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఇకపై ప్రతి ఏటా సర్ ఆర్థర్ కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, డా.కె.ఎల్.రావు, శ్రీరాం కృష్ణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అధికారులు కూడా ఇందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పోలవరం పర్యటించి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారని, వరుస రివ్యూలు చేపడుతున్నారన్నారు. డా.కె.ఎల్. రావు ఇంజనీర్‌గా మాత్రమే కాకుండా దేశం కూడా అన్నివిధాలా అభివృద్ధి చెందాలని తపించిన మహనీయులు కె.ఎల్.రావు అని కీర్తించారు. అనంతరం.. నీటిపారుదల శాఖ రిటైర్డ్ సీనియర్ ఇంజనీర్లు ఆర్. సతీష్ కుమార్, బి.ఎస్.ఎస్. శ్రీనివాస్ యాదవ్, ఎం.వి. కృష్ణారావు, కె.వి. కృష్ణారావు, మారుతి ప్రసాద్‌లను మంత్రి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వైజర్ ఎం. వెంకటేశ్వరరావు, ఇంజనీర్ చీఫ్ అడ్మిన్ కె. శ్రీనివాస్, హైడ్రాలజీ సీఈ కుమార్, మైనర్ సీఈ సాయిరామ్ ప్రసాద్, ఎస్ఈ టి.జె.హెచ్ ప్రసాద్ బాబు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎస్.తిరుమల రావు, అపెక్స్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎ.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



# చరిత్రలో నిలిచేలా రొట్టెల పండుగ

### - రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : : చరిత్రలో నిలిచేలా ప్రపంచ ప్రసిద్ధి చెందిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో తాను మంత్రిగా దర్గాలో శాశ్వత మరుగుదొడ్లు, సిమెంటు రోడ్లు, ఘాట్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, రొట్టెల పండుగలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అదేవిధంగా ఇప్పుడు కూడా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పార్కింగ్ ప్రదేశాల్లో కూడా తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాఖలవారీగా సమీక్షించారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, వైద్యారోగ్యశాఖ, మత్స్యశాఖ, అగ్నిమాపక తదితర శాఖలవారీగా చేపట్టిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణకు సుమారు 5వేల మందిని ప్రైవేటుగా నియమిస్తున్నామని, పార్కింగ్ ప్రదేశాల్లో టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని, 12 తాగునీటి స్టాల్స్ ఏర్పాటుచేసి నిరంతరం భక్తులకు స్వచ్ఛమైన నీటిని అందించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 2వేల మందితో పటిష్ట పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు మంత్రికి వివరించారు. ఘాట్ల వద్ద నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు అగ్నిమాపకశాఖ ద్వారా 10 పంపుల ద్వారా వాటర్‌ను పంపింగ్ చేయనున్నట్లు చెప్పారు. 45మంది గతఈతగాళ్లు, రెండు బోట్లలో గస్తీ ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలకు నిరంతరం బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం తెలిపారు. వైదారోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ స్టాల్స్, 57రకాల మందులు , అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. స్పెషలిస్టు వైద్యులను కూడా వైద్యశిబిరాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. విద్యుత్‌సరఫరాకు అంతరాయం లేకుండా, ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ తెలిపారు. రొట్టెల పండుగ వచ్చే భక్తులందరూ సంతృప్తి చెందేలా అధికారులందరూ పనిచేయాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి సుమారు వారం రోజుల పాటు రొట్టెల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ఈ పండుగకు ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 20 లక్షల మందికి పైగా బారాషహీద్ దర్గా సందర్శనకు విచ్చేస్తారని చెప్పారు. కులమతాలకతీతంగా అందరూ విచ్చేసి స్వర్ణాల చెరువులో కోరిన కోర్కెలు తీరేందుకు రొట్టెలు పట్టుకోవడం, తర్వాత సంవత్సరంలో వచ్చి కోర్కె తీరిన అనంతరం మళ్లీ రొట్టెలు వదలడం గత 400 సంవత్సరాలకు పైగా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతుందన్నారు. ఏడాదికేడాది భక్తుల సంఖ్య పెరుగుతుందంటే అది బారాషహీద్ దర్గా పట్ల భక్తులకున్న ప్రగాఢ విశ్వాసమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ నిర్వహణపై అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సంపూర్ణ చర్యలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య శిబిరాలు, ఎలక్ట్రిసిటీ, ఫైర్ అధికారుల పర్యవేక్షణ, దివ్యాంగులకు సౌలభ్యంగా ఏర్పాట్లు, స్వచ్ఛంధసంస్థల వారు భోజనాలు ఏర్పాటు చేస్తే వారికి వసతుల కల్పన, తదితర అంశాలపై కలెక్టర్‌తో పాటు అన్నీ శాఖల అధికారులతో మాట్లాడినట్లు మంత్రి నారాయణ తెలిపారు. బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు సంబంధించి 95 శాతం మేర పనులన్నీ పూర్తయ్యాయని, మిగిలిన 5 శాతం కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఏఎస్పీలు సౌజన్య, గాదె శ్రీనివాసరావు, శ్రీనివాసులు, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, మున్సిపల్ ఎస్ఈ సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, మత్స్యశాఖ ఎస్ఈ నాగేశ్వరరావు, డిపివో సుస్మిత, ఆర్డీవో మలోల, తహశీల్దార్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కావలి తెలంగాణ ముచ్చట్లు : జులై 15 : కావలి పట్టణంలోని జెండా చెట్టు వద్ద గల పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గారు సోమవారం ప్రారంభించారు.. స్వయంగా ఆయనే అందరికీ వడ్డించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ముందుగా ఎమ్మెల్యే కు స్థానిక చావిడి, దర్గా, మసీదు కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.. ట్రంక్ రోడ్డు పై గల కలాం విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.. అనంతరం చావిడి లో నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.. మొహరం ఆవిర్భావం, విశిష్టత, ఏర్పాటు చేసే కార్యక్రమాలు, తదితర విషయాలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా వివరించారు.

# సినిమా న్యూస్




# సామ్.. ఈ లుక్కుతో కిల్ చేసేలా..




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సిల్వర్ స్క్రీన్ పై కనపడి చాలా నెలలు అవుతోంది. దాదాపు రెండేళ్ల క్రితం ఖుషీ మూవీతో పలకరించిన సామ్.. ఇప్పటివరకు మళ్లీ కొత్త సినిమాతో సందడి చేయలేదు. దీంతో ఆమెను వెండితెరపై చూసేందుకు ఫ్యాన్స్ తోపాటు సినీ ప్రియులు ఎంతో వెయిట్ చేస్తున్నారు. ఆ మధ్య తన బర్త్ డే సందర్భంగా మా ఇంటి బంగారం టైటిల్ తో తన సొంత బ్యానర్ పై సినిమాను అనౌన్స్ చేసింది సమంత. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఆ చిత్రాన్ని సమంత స్వయంగా నిర్మిస్తోంది. కానీ ఆ ప్రాజెక్ట్ కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. పైగా కొన్ని నెలలకు సోషల్ మీడియాలో వివిధ థెరపీల కోసం పోస్టులు పెడుతోంది సామ్. హెల్త్ టిప్స్ కూడా ఇస్తోంది. రీసెంట్ గా సద్గురు ఆశ్రమానికి వెళ్లి ఆధ్యాత్మిక చింతనలో కనిపించింది. దీంతో ఆమె ఇంకా సినిమాలు చేయడం స్టార్ట్ చేయలేదని వార్తలు వచ్చాయి. అయితే ఇప్పటికే ఆమె పూర్తి చేసిన సిటాడెల్ హనీ బనీ వెబ్ సిరీస్ త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. మరో రెండు వెబ్ సిరీసులతో పాటు కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వస్తోంది. మలయాళం స్టార్ హీరో మమ్ముట్టి సినిమాలో సామ్ హీరోయిన్ గా ఎంపికైందని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ లాంచింగ్ ఈవెంట్ లో ఆమె కనిపించలేదు. ఎలాంటి పోస్ట్ కూడా పెట్టలేదు. ప్రస్తుతం బాలీవుడ్ నటులతో పలు యాడ్స్ చేస్తోంది సామ్. ఇప్పుడు తాజాగా %జుూాజు% మ్యాగ్ జైన్ కవర్ పేజీపై దర్శనమిచ్చింది. బ్లాక్ కలర్ ఫుల్ డిజైనర్ డ్రెస్ లో మెరిసింది సామ్. అందులో అమ్మడు అదిరిపోయింది. హెయిర్ లీవ్ చేసి తన గ్లోయింగ్ స్కిన్ తో ఆకట్టుకుంటోంది. తన చూపుతో అందరినీ మాయ చేస్తోంది. తన ఎక్స్ప్రెషన్ తో మత్తెక్కిస్తోంది. ఎద అందాలతో కవ్విస్తోంది. అందుకు సంబంధించిన పిక్ ఇప్పుడు వైరల్ గా మారింది. సమంత స్పెషల్ ఇంటర్వ్యూ తమ మ్యాగ్ జైన్ లో ఉన్నట్లు %జుూాజు% సంస్థ పోస్ట్ పెట్టింది. ఉదయ్ పూర్ రిసార్ట్ లో పిక్ దిగినట్లు తెలిపింది. 50 మిలియన్ల మంది ఫాలోవర్స్.. ఆమె గురించి తెలుసుకోవాలని తహతహలాడుతున్నట్లు చెప్పింది. మొత్తానికి డీసెంట్ గ్లామర్ తో సామ్.. పిక్ లో అదిరిపోయిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. పిక్ సూపర్ అని అంటున్నారు.

# అందాల కపూర్ క్లోజప్ క్లీవేజ్ షో




రన్ రాజా రన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. బాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లో కూడా నటించిన ఈ కపూర్ బ్యూటీకి ఆశించిన స్థాయిలో సక్సెస్ లు దక్కలేదు. అయితే సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలకు మాత్రం మంచి క్రేజ్ ఉంది. ఈ మధ్య కాలంలో సినిమాల్లోనే కాకుండా ఓటీటీ షో లు మరియు సిరీస్ ల్లో కూడా నటిస్తుండటం వల్ల రెగ్యులర్ గా వార్తల్లో ఉంటుంది. హిందీ సినిమాల్లో రాణించాలని ఆశ పడుతున్న ఈ అమ్మడు ప్రస్తుతానికి టాలీవుడ్ సినిమాలు, సిరీస్ లతో సరిపెట్టుకుంటోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందాల షో కి అక్కడ ఇక్కడ అన్ని చోట్ల కూడా మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. అబ్బ అనేంత అందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగా క్లీవేజ్ షో తో హీరోయిన్స్ కన్నుల విందు చేస్తూనే ఉంటారు. సీరత్ కపూర్ మాత్రం ఈ ఫోటోల్లో క్లోజప్ లో క్లీ వేజ్ షో తో మతి పోగొట్టింది. ఈ స్థాయి అందాల ప్రదర్శన చేస్తూ, అందంగా కనిపిస్తూ ఉన్నా కూడా పాపం సీరత్ కపూర్ కి దక్కాల్సిన గుర్తింపు, ఆఫర్లు రావడం లేదు అంటూ నెట్టింట కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి కొత్త ప్రాజెక్ట్ లు ఏమీ చేతిలో లేవని, అయితే రెండు మూడు సినిమాలు, సిరీస్ లు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఈ ఏడాదిలోనే వాటి ప్రారంభం ఉండే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు నమ్ముతున్నారు.

# అంబానీ పెళ్లిలో చందమామ వ్వారెవ్వా!



అందాల చందమామ కాజల్ అగర్వాల్ లేటెస్ట్ డిజైనర్ శారీ అభిమానుల హృదయాలను దోచుకుంది. బ్రౌన్ బార్డర్ తో డిజైన్ చేసిన డార్క్ పింక్ శారీ.. కాంబినేషన్ బ్లౌజ్‌లో చందమామ దివ్యమైన రూపం ఫ్యాన్స్ లో చర్చకు వచ్చింది. పెళ్లిలో ఎందరు అందగత్తెలు ఉన్నా కాజల్ స్టన్నర్ గా నిలిచిందని కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. వివరాల్లోకి వెళితే... అనంత్ అంబానీ - రాధిక మర్చంట్ వివాహం అంగరంగ వైభవంగా సాగిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పెళ్లి వేడుకల అనంతరం శుభ్ ఆశీర్వాద్ వేడుకలో భర్త గౌతమ్ కిచ్లుతో కలిసి కాజల్ అగర్వాల్ పాల్గొన్నారు. నవదంపతులకు ఆశీర్వాదాలు అందించేందుకు ఇన్‌స్టాలోకి వెళ్లిన కాజల్ నూతన వధూవరులకు హృదయపూర్వక నోట్ రాసింది. ఈ జంట జీవితకాలం సంతోషంగా ఉండాలని కోరుకున్న కాజల్ తన భర్తతో కలిసి ఉన్న అందమైన ఫోటోని షేర్ చేసింది. అనంత్ -రాధిక జీవితకాలం ప్రేమతో చాలా సంతోషకరమైన వైవాహిక జీవితాన్ని కోరుకుంటున్నాను.. అని రాసారు. అంబానీల పెళ్లి వేడుకలో కాజల్ అగర్వాల్ రకరకాల డిజైనర్ చీరల్లో కనిపించారు. ఇంతకుముందు పచ్చ రంగు చీరలో తళుక్కుమన్న కాజల్ ఆ తర్వాత ఎంబ్రాయిడరీ లెహంగా సెట్‌లో అబ్బురపరిచింది. కాజల్ ఈవెంట్లో గొప్ప సాంప్రదాయాన్ని ఎలివేట్ చేసే దుస్తుల్లో మెరిసిపోయింది. జూలై 12న ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అనంత్ అంబానీ- రాధిక మర్చంట్ వివాహం జరిగింది. మరుసటి రోజు శుభ్ ఆశీర్వాద్ వేడుకతో వేడుకలు కొనసాగాయి. వివిధ రంగాలకు చెందిన అనేక మంది %ూా%-లిస్టర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ దంపతులు నవదంపతులను ఆశీర్వదించిన విశిష్ట అతిథులలో ఉన్నారు. అనంత్ - రాధికలకు తన ఆనందాన్ని శుభాకాంక్షలు తెలుపుతూ వేడుక నుండి కాజల్ చాలా ఫోటోలను పోస్ట్ చేసింది.

# టెండూల్కర్ వారసురాలు దేవతాసుందరి రూపం!



క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ వారసురాలు సారా టెండూల్కర్ పరిచయం అవసరం లేదు. తనదైన అందం, వైబ్స్ తో నిరంతరం కుర్రకారు గుండెల్లో గిలిగింతలు పెడుతున్న సారా టెండూల్కర్ కి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాల్లో సారాను అనుసరించేవారి సంఖ్య లక్షల్లో ఉంది. మరోవైపు టీమిండియా యువక్రికెటర్ శుభ్ మాన్ గిల్ పై సారా టెండూల్కర్ అభిమానం, స్నేహం గురించి తెలిసిన అభిమానులు ఆ ఇద్దరినీ లవర్స్ అంటూ ఆటపట్టిస్తుంటారు. ఇక సారా టెండూల్కర్ ఇప్పటికే పలువురు బాలీవుడ్ కథానాయికలతో కలిసి కమర్షియల్ ప్రకటనల్లో నటించడం వాటిలో తన అందంతో కట్టి పడేయడంతో సారా కూడా త్వరలోనే బాలీవుడ్ లో కథానాయికగా అడుగులు వేయడం ఖాయమని ఊహించారు. కానీ ఇప్పటివరకూ సారా నటరంగ ప్రవేశం గురించి ఎలాంటి అప్ డేట్ లేదు. కానీ అన్నిచోట్లా సారా వైబ్స్ విస్తరిస్తూనే ఉన్నాయి. సారా ఏం చేసినా తన గురించి ఆరాలు తీసేవారున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాల్లో సారాను ఫాలో చేసేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తాజాగా సారా టెండూల్కర్ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహానంతర వేడుకల్లో అద్భుతమైన గులాబీ రంగు లెహంగాలో ప్రత్యక్షమైంది.

**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in "Mail I'd: telanganamuchatlu.in@gmail.com